సాక్షి ఒడిశా
శుక్రవారం । 18 । అక్టోబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,09,807లు, బంగారం 390 మిల్లీగ్రాములు వెండి 129 గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



8, 9 తేదీల్లో మత్స్య, ప్రాణిసంపద మేళా

గజపతి జిల్లా స్థాయిలో మత్స్య, ప్రాణిసంపద శాఖల మేళా నవంబర్ 8, 9 తేదీల్లో గజపతి స్టేడియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ బిజయకుమార్ దాస్ తెలిపారు.

- 8లో



భార్య గొంతు కోసిన భర్త

కలిమెల సమితి పోలీసుస్టేషన్ పరిధిలో ఎంవీపీ 23 గ్రామంలో బుధవారం ఓ వ్యక్తి తన భార్య గొంతు కోశాడు.

- 8లో

న్యూస్‌రీల్

జయపురం యువతికి స్వర్ణ పతకం



మౌసిమి టక్రిని అభినందిస్తున్న తల్లి, స్నేహితులు

జయపురం: ఈ నెల 16న గోవాలో జరిగిన నేషనల్ బెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఒడిశా మహిళా పోలీసు, జయపురంలోని బరిణిపుట్‌కు చెందిన మౌసిమి టక్రి మాస్టర్ వన్ కేటగిరీలో స్వర్ణ పతకం సాధించింది. ఈమె ఒడిశా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, దళిత మహాసంఘ మహిళా అధ్యక్షురాలు మానస్వినీ టక్రి కుమార్తె. ఈ సందర్భంగా మౌసిమిని పలువురు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి



రోడ్డు మీద మృతదేహాలు

కొరాపుట్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. నబరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితి జమాదిహి గ్రామానికి చెందిన జగదీష్ హరిజన్ (22), బుభన్ హరిజన్ (23)లు ద్విచక్ర వాహనం మీద నబరంగ్‌పూర్ వెళ్తున్నారు. ఇదే సమయంలో మరో ద్విచక్ర వాహనం ఎదురుగా వచ్చి వీరికి సమీపంలో వెళ్లింది. దీంతో వీరి వాహనం అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ట్రక్ కింద పడిపోయారు. వీరిని ఆస్పత్రికి తరలించే సరికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు.

యువకుడు అనుమానాస్పద మృతి



మృతుడు సుభల్ మహంత్ (ఫైల్)

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా జొరిగాం సమితి చొట్బాగుడ డీఎన్‌కే గ్రామానికి చెందిన సుభల్ మహంత్ (25) గురువారం మృతి చెందారు. ఇతని మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సుభల్ భార్య చంచల్ మహంత్‌తో కలిసి నివాసం ఉంటున్నాడు. అతని ఇంటికి సమీపంలోనే వేరే ఇంటిలో తల్లిదండ్రులు ఉంటున్నారు. గురువారం సుభల్ ఇంటి నుంచి కేకలు వినిపించడంతో అతని తల్లిదండ్రులు ఇంటికి చేరుకున్నారు. అప్పటికే సుభల్ గొంతు వద్ద గాయంతో అచేతన స్థితిలో ఉన్నాడు. వెంటనే గ్రామస్తులు జొరిగాం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. మృతుని భార్య చంచల్ మాత్రం తన భర్త విద్యుత్ షాక్‌తో చనిపోయాడని పోలీసులకు వాంగ్మూలం ఇచ్చింది. దీనిపై ఉమ్మర్‌కోట్ ఎస్‌డీపీఓ మధు సిక్తా మిశ్రా దర్యాప్తు చేస్తున్నారు.

చోరీలపై అప్రమత్తం



సమావేశంలో పాల్గొన్న సంతోషిమా నగర్ సిటిజన్ కమిటీ సభ్యులు

జయపురం: స్థానిక పారాబెడ సంతోషీమాత నగర్ ప్రజల రక్షణ, భద్రత తదితర సమస్యలపై సిటిజన్ కమిటీ సభ్యులు గురువారం సమావేశం నిర్వహించారు. సార్థక అకాడమీ ప్రాంగణంలో ప్రకాశ్ మిశ్రా అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసి సంతోషీమా నగర్ పరిస్థితులపై చర్చించారు. నగర్ కాపలాకు కమిటీ నియమించిన సెక్యూరిటీ గార్డులు కొద్ది రోజులుగా రావటంలేదని, పని చేసేందుకు వారు విముఖత చూపుతున్నారని ప్రకాశ్ మిశ్రా తెలియజేశారు. ఇటీవల సంతోషిమా ప్రథమ లైన్‌లో శివరాం త్రిపాఠీ ఇంటిలో దొంగతనం జరిగిందని, సెక్యూరిటీ గార్డులు రాక పోవటం వల్లే చోరీలు జరుగుతున్నాయన్నారు. వెంటనే కొత్త సెక్యూరిటీ గార్డులను నియమించటం, వీధులలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయటం అవసరమన్నారు. సంతోషిమా సమస్యలపై కొరాపుట్ జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించాలని ప్రకాశ్ మిశ్ర చేసిన ప్రతిపాదనలను సభ్యులు ఆమోదించారు. ఈ నెల 20వ తేదీన సంతోషీమాత నగర్‌లో మహిళలు, పురుషులతో మరోసారి సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో శివరాం త్రిపాఠీ, రామనాథ్ సాహు, అజయ మిశ్ర, నయన కిశోర్ మహంతి, సుభాష్ చంద్ర మిశ్ర తదితరులు పాల్గొన్నారు.

కరుణించు తల్లీ గజలక్ష్మి..!

- ఘనంగా ప్రారంభమైన గజలక్ష్మి పూజలు
- ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

రాయగడ: పట్టణంలో గురువారం నుంచి గజలక్ష్మి పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక న్యూకాలనీలో గత 28 ఏళ్లుగా గజలక్ష్మీ పూజలను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా అట్టహాసంగా పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. బుధవారం రాత్రి సమీపంలోని జంఝావతి నది వద్ద గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలను నిర్వహించి, అక్కడ నుంచి శుద్ధ జలాలను కలశాలతో తీసుకొచ్చి మందిర ప్రాంగణంలో ఉంచారు. అదేవిధంగా స్థానిక ఆర్‌కే నగర్, రామా టాకీస్ రోడ్డు సమీపంలోనూ గజలక్ష్మి పూజలను చేపడుతున్నారు.

జయపురం: పట్టణంలో మా గజలక్ష్మి పూజలు బుధవారం రాత్రి ప్రారంభమయ్యాయి. స్థానిక బంకమఠం, రాజమహల్ జంక్షన్, న్యూ బ్యాంక్ కాలనీలో పూజలు నిర్వహిస్తున్నారు. న్యూ బ్యాంక్ కాలనీ, బంకమఠం, రాజమహల్ కూడలి వద్ద ఘనంగా పూజలు జరుగుతున్నాయి. రాజమహల్ కూడలి గజలక్ష్మి దేవి వద్ద ఒక ఆదివాసీ మహిళ ఆదివాసీ భాషలో దేవికి మంత్రాలు వల్లిస్తూ పూజ చేయడం అందరినీ ఆకట్టుకుంది.

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో పాతపోస్టాఫీస్ వీధిలో గజలక్ష్మి పూజాలు నిర్వహించారు. అమ్మావారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గురువారం ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మహిళలు గౌరీనోము నిర్వహించారు.



మల్కన్‌గిరి: పాత పోస్టాఫీస్ వీధిలో...



రాయగడ: గంగమ్మ తల్లికి పూజలునిర్వహిస్తున్న దృశ్యం



రాయగడ: రామా టాకీస్ రోడ్డు వద్ద..



రాయగడ: న్యూకాలనీలో పూజా పెండాల్



రాయగడ: ఆర్‌కే నగర్ వద్ద గజలక్ష్మి అమ్మవారు



జయపురం: బంకమఠం వద్ద...



మల్కన్‌గిరి: గౌరీదేవిని పూజిస్తున్న తెలుగు మహిళలు



జయపురం: రాజమహల్ కూడలి వద్ద...



జయపురం: న్యూబ్యాంక్ కాలనీ వద్ద...

పట్టుబడిన దొంగలు



పట్టుబడిన దొంగలు



వివరాలు వెల్లడిస్తున్న ఎఎస్పీ శ్రీకాంత్ బెహరా తదితరులు

కొరాపుట్: వల పన్ని దొంగలను పోలీసులు పట్టుకున్నారు. కొరాపుట్ సదర్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఏఎస్పీ శ్రీకాంత్ బెహరా ఈ కేసు వివరాలు ప్రకటించారు. గత కొద్ది రోజులుగా ప్రముఖ పర్యటక ప్రాంతం పుంజుసీల్ వద్ద పర్యాటకుల కార్లలో విలువైన వస్తువులు చోరీకి గురవుతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు లబోదిబోమంటూ తిరిగి స్వస్థలాలకు వెళ్లిపోతున్నారు. వీరిలో అత్యధిక మంది పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేయడం లేదు. దీంతో ఈ విషయం పోలీసుల దృష్టికి వచ్చింది. వెంటనే కొరాపుట్ సదర్ ఐఐసీ రుణు మజ్జి నేతృత్వంలో పోలీసులు పర్యాటకుల మాదిరిగా కారులో పుంజసీల్ జలపాతం సమీపానికి వెళ్లారు. అక్కడ కారు ఉంచి కొంతదూరంగా మఫ్టీలో మాటువేశారు. ఇదే సమయంలో కొంతమంది యువకులు కారు తలుపులు తెరవడానికి ప్రయత్నం చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. దొంగల్లో ఇద్దరు మైనర్లు ఉండడం గమనార్హం. అలాగే వీరినుంచి వస్తువులు కొనుగోలు చేసిన వ్యక్తులను కూడా అదుపులోకి తీసుకున్నారు. వీరి నుండి రూ.3,500 నగదు, రెండు సెల్‌ఫోన్లు, ఒక ట్యాబ్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ముగ్గురు జూదరుల అరెస్టు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పోలీస్‌స్టేషన్ పరిధి నకిటి మామిడి తోటలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను టికిరి పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. బుధవారం అర్ధరాత్రి ఈ మేరకు దాడులను నిర్వహించిన పోలీసులు నిందితుల నుంచి ఆట సామగ్రితో పాటు రూ.2,740లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైనవారిలో జగన్నాథ తురుకు, సాదు మాఝి, అర్జున్ మాఝిలు ఉన్నారు.



అరెస్టైన నిందితులు

సమస్యలకు మోక్షం కల్పించండి

కొరాపుట్ :

సమస్యలు పరిష్కరించి తమ కష్టాలు గట్టెక్కించాలని దశమంతపూర్ సమితి చౌలకంటి గ్రామస్తులు కోరారు. ఈ మేరకు గురువారం లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంతను గ్రామానికి ఆహ్వానించి సమస్యలు విన్నవించారు. చెరువులను తలపిస్తున్న రోడ్డు, అందని సంక్షేమ పథకాలు, ప్రజల దీనావస్థలు చూసి చలించిన ఎమ్మెల్యే తక్షణం సమస్యలు పరిష్కరిస్తామని హామీఇచ్చారు.



చౌలకంటి రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పవిత్ర శాంత

జగన్నాథపూర్‌లో బస్టాప్ ప్రారంభం



బస్టాప్ ప్రారంభిస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి సునాఖండి పంచాయతీలోని జగన్నాథపూర్‌లో బస్టాప్‌ను సమితి ఉపాధ్యక్షుడు డొంబురు కంజక గురువారం ప్రారంభించారు. గత కొన్నేళ్లుగా ఈ ప్రాంత ప్రయాణికులు బస్సుల కోసం ఎండలో వేచి ఉంటుండడంతో ప్రజల డిమాండ్ మేరకు సమితి నిధులతో దీనిని నిర్మించారు. కార్యక్రమంలో సర్పంచ్ సంజయ్ నిసిక, గేదెల శ్రీనివాస్, సమితి సభ్యులు సుపురు కులుసిక, గోవింద చంద్ర బిసాయి తదితరులు పాల్గొన్నారు.

యువతిపై లైంగిక దాడి యత్నం

జయపురం: బరిణిపుట్ పంచాయతీ బి.మాలిగుడ మాలిసాహికి చెందిన టునా మాలి తనపై లైంగికదాడికి ప్రయత్నించాడని అదే గ్రామానికి చెందిన ఓ యువతి బుధవారం స్థానిక మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసు అధికారి అనిత కుజురు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

తేనెటీగల దాడిలో యువకుడి మృతి



సురేంద్ర జొడియా (ఫైల్)

రాయగడ: తేనెటీగల దాడిలో ఒక యువకుడు మృతి చెందిన ఘటన జిల్లాలోని కాసీపూర్ సమితి గొడుబలి పంచాయతీ బొంధుమండి గ్రామంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి అదే గ్రామానికి చెందిన సురేంద్ర జొడియా (40)గా గుర్తించారు. బుధవారం సాయంత్రం సమీపంలో అడవులకు కట్టెలు తీసుకొచ్చేందుకు సురేంద్ర వెళ్లాడు. ఈ క్రమంలో కట్టెలు సేకరిస్తున్న సమయంలో ఒక చెట్టుపై ఉన్న తేనెటీగలు అతడిపై దాడి చేశాయి. దీంతో తీవ్రగాయాలకు గురైన సురేంద్ర పరుగున వచ్చి ఇంటి ఆవరణలో పడిపోయాడు. కుటుంబీకులు వెంటనే అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

నాటుసారా పట్టివేత

- ఇద్దరు అరెస్టు

జయపురం: కొరాపుట్ జిల్లా ఎక్సైజ్ ఫ్లెయింగ్ స్క్వాడ్, జయపురం ఎక్సైజ్ సిబ్బంది సంయుక్తంగా రెండు ద్విచక్ర వాహనాలపై తరలిస్తున్న నాటుసారా పట్టుకొని, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శశికాంత రథ్ గురువారం వెల్లడించారు. అరెస్టైనవారిలో జయపురం సమితి పల్లిగుడ గ్రామానికి చెందిన కృష్ణ ఖొర, నీలాగుడకు చెందిన అభి హియాల్‌లు ఉన్నట్లు పేర్కొన్నారు. వారి నుంచి ట్యూబ్‌లలో తీసుకెళ్తున్న నాటుసారా, రెండు బైక్‌లు సీజ్ చేసినట్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గురువారం ఉదయం ఎక్సైజ్ అధికారులు పెట్రోలింగ్ చేపట్టారు. ఆ సమయంలో కృష్ణ ఖొర పల్లిగుడ నుంచి ఒక బైక్‌పై జయపురం వస్తుండగా, అతడిని 26వ జాతీయ రహదారి పారాబెడ జంక్షన్‌లో ఎక్సైజ్ సిబ్బంది అడ్డుకొని బైక్‌పై తీసుకెళ్తున్న సారాను పట్టుకొని అతడిని అరెస్టు చేశారు. అలాగే నంబర్ లేని ఒక బైక్‌పై నాటుసారా తీసుకొస్తున్న అబి హియాల్‌ను చందనబెడ కూడలి వద్ద ఆపి బైక్, సారాను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. దాడుల్లో జిల్లా ఎక్సైజ్ ఫ్లెయింగ్ స్క్వాడ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర పాడియారి, ఓఐసీ రాజకుమార్ క్షితి, ఏఎస్ఐ సుశాంత కుమార్ నాయిక్, ఉమేష్ ఖొర తదితరులు పాల్గొన్నారు.



అరెస్టైనవారిని చూపిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

హత్య కేసులో ముగ్గురు అరెస్టు



నబరంగ్‌పూర్ పోలీసుల అదుపులో హత్య కేసు నిందితులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో మెయిన్ రోడ్డులో జరిగిన హత్య ఘటనలో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఐఐసీ సంబిత్ బెహరా ఈ కేసు వివరాలు గురువారం ప్రకటించారు. ఈ నెల 14వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో అల్లరి మూకలు చెలరేగి దాడులు చేశాయి. ఈ ఘటనలో జిల్లా కేంద్రంలోని దండాశి వీధికి చెందిన కిరణ్ హరిజన్ మృతి చెందాడు. ఈ ఘటనకి పాల్పడిన సారా వీధికి చెందిన బొని నాయక్, బొడ హరిజన్ వీధికి చెందిన సుమిత్ నాయక్, నిశ్నాహండి గ్రామానికి చెందిన సురజ్ హరిజన్‌లను అరెస్ట్ చేసి జైలు కి తరలించారు.

పికప్ వ్యాన్ బోల్తా : ఆరుగురికి తీవ్ర గాయాలు



ఘాటీపై రోడ్డు పక్కన బోల్తాపడిన పికప్ వ్యాన్



రహదారిపైన స్పృహ తప్పి పడిపోయిన వ్యక్తి



రహదారి పక్కనే ఉన్న క్షతగాత్రులు



వ్యాన్ నుంచి క్షతగాత్రులను బయటకు తీస్తున్న స్థానికులు

మల్కన్‌గిరి : చిత్రకొండ సమితి గాజుల్‌మమ్ముడి పంచాయతీ బంగ్గుడ ఘాటీపై గురువారం ఉదయం ఓ పికప్ వ్యాన్ బోల్తా పడి ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. చిత్రకొండ సమితి అల్లంపాక గ్రామంలో జరుగుతున్న వారపు సంతకు వ్యాపారులు పికప్ వ్యాన్‌లో బయల్దేరారు. వ్యాన్ ఘాటీపైకి వచ్చేసరికి అదుపు తప్పడంతో బోల్తా పడింది. దీంతో వాహనంలో ఉన్న వారంతా గాయపడ్డారు. 108కు ఫోన్ చేసినా నెట్‌వర్క్ సమస్య వల్ల చాలాసేపటి వరకు ఆ వాహనం రాలేకపోయారు. దీంతో క్షతగాత్రులు సంఘటన స్థలంలోనే ఆర్తనాదాలు చేస్తూ ఉండిపోయారు. ఆ దారిన వెళ్తున్న వారు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి తీసుకురావడంతో ప్రమాదం జరిగిన రెండు గంటల తర్వాత క్షతగాత్రులను చిత్రకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అప్పటికే వారిలో కొందరు స్పృహ తప్పి పడిపోయారు. క్షతగాత్రుల్లో ఇద్దరు మహిళలు ఉండడంతో వారిని మల్కన్‌గిరి ఆస్పత్రికి తరలించారు. చిత్రకొండ ఐఐసీ ముకుందో మేల్కా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

దొంగతనానికి విఫలయత్నం

పర్లాకిమిడి: గుసాని సమితి ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీ, పాటికోట రోడ్డులో తాళం వేసి ఉన్న ఇంటిలో గురువారం దొంగతనానికి పాల్పడిన చోరులు దొరికిపోయారు. గురండి పోలీసు అధికారి రవీంద్ర పాత్రో తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గురువారం మధ్యాహ్నం సెంచూరియన్ వర్సిటీ, పాటికోట రోడ్డులో తాళం వేసిన ఒక ఇంటిలోకి ఇద్దరు మహిళలు ప్రవేశించారు. వీరిని చూసిన ఇరుగు పొరుగు వారు వెంటనే పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేశారు. వెంటనే గురండి ఐఐసీ రవీంద్ర పాత్రో సంఘటన స్థలానికి చేరుకుని దొంగలను పర్లాకిమిడి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీరు ఒడిశాలోని బలంఘీర్‌కు చెందిన వారని రవీంద్ర తెలిపారు.

హార్డ్‌వేర్ షాపులో చోరీ

రాయగడ: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని షిరిడీ సాయి హార్డ్‌వేర్ షాప్‌లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. దుకాణం వెనుకనున్న షట్టర్‌ను గ్యాస్ కట్టర్‌తో కోసి దుండగులు లోపలికి ప్రవేశించారు. షాప్‌లోని రూ.30 వేల నగదును దోచుకెళ్లారు. గత మంగళవారం నుంచి షాప్ యజమాని బొచ్చ గుప్తేశ్వర్ షాప్‌ను మూసివేశాడు. గురువారం యథావిధిగా షాపును తెరిచేందుకు వెళ్లి చూడగా వెనుక షట్టర్ తెరిచి ఉండడం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

ఒడిశా మిషన్-2024 ప్రారంభం



మిషన్ ఒడిశా-2024 లోగో, పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి : జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో గురువారం ఒడిశా మిషన్-2024ను కలెక్టర్ ఆశిష్ ఈశ్వర్ పటేల్ ప్రారంభించారు. ముందుగా మిషన్ లోగో, పోస్టర్ కరపత్రాలను ప్రారంభించారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి విశ్వనాథ్ సాహు మాట్లాడుతూ ఈ ఒడిశా మిషన్-2024 ద్వారా బడి బయట పిల్లలను బడిలో చేర్పిస్తామని, దీనిపై టీచర్ల ద్వారా పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఒరియా భాషపై పిల్లలకు ఉన్న సందేహాలను నివృత్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ అధ్యక్షురాలు సోమారి టంగులు, జిల్లా అదనపు కలెక్టర్ సోమనాథ్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లకో వాన..



ఎస్‌కేసీజీ కళాశాలలో కురుస్తున్న వర్షం

పర్లాకిమిడి: కోస్తాంధ్రలో వాయుగుండం ప్రభావంతో గజపతి జిల్లాలో గురువారం సాయంత్రం గంటసేపు ఉరుములతో కూడిన వర్షం పడింది. చాలారోజులుగా వర్షాలు లేనందున ఖరీఫ్ పంట ఒకవైపు ఎండిపోతోంది. కురిసిన వర్షం వల్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి రిమాండ్

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని దమ్మలవీధిలో బుధవారం మధ్యాహ్నం పుక్కళ్ల రాము అనే యువకుడిని అదే వీధికి చెందిన తోట దుర్గాప్రసాద్ కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి దుర్గాప్రసాద్‌ను గురువారం అరెస్టు చేసి 14 రోజుల రిమాండ్‌కు తరలించినట్లు ఒకటో పట్టణ ఎస్ఐ హరికృష్ణ పేర్కొన్నారు.

వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ అధిపతిగా అశోక్

బూర్జ: మండలంలోని పెద్దపేటలో గల డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఉద్యాన పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్తగా, అధిపతిగా డాక్టర్ పి.అశోక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన వెంకటరామన్నగూడెంలోని ఆర్టికల్చర్ ఉద్యాన పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్తగా విధులు నిర్వర్తించి ఇక్కడికి బదిలీపై వచ్చారు. తెగుళ్ల విభాగం సీనియర్ శాస్త్రవేత్తగా టి.రాజశేఖరం బాధ్యతలు చేపట్టారు. ఈయన పెట్లూరులోని నిమ్మపరిశోధనా స్థానంలో సీనియర్ శాస్త్రవేత్తగా పనిచేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

కలెక్టర్‌ను కలిసిన బుడితి కార్మికులు

సారవకోట: మండలంలోని బుడితి గ్రామానికి చెందిన కంచు, ఇత్తడి కార్మికులు కింతా బుజ్జి ఆధ్వర్యంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలిశారు. నెల రోజుల పాటు శ్రమించి తయారు చేసిన పూర్ణ ఘటాన్ని విజయవాడ సచివాలయానికి చేరవేయాలని కోరారు. కంచు, ఇత్తడి పరిశ్రమకు ప్రభుత్వం ద్వారా సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ త్వరలో గ్రామాన్ని సందర్శించి పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

గుమ్మా సమితిలో ఎమ్మెల్యే పర్యటన



గుమ్మాసమితి అమెసింగి గ్రామంలో ఎమ్మెల్యే రూపేష్‌కు స్వాగతం పలుకుతున్న ప్రజలు



సెరంగో గ్రామంలో ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహికి స్వాగతం పలుకుతున్న ప్రజలు

పర్లాకిమిడి: స్థానిక ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి గురువారం గుమ్మా సమితిలో సెరంగో బీసీఎంఎస్ పాలక మండలి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గుమ్మా సమితి ఆదివాసీ ప్రజల అభ్యున్నతికి పనిచేస్తానని ఎమ్మెల్యే పాణిగ్రాహి అన్నారు. అనంతరం ఆయన భుభుని పంచాయతీలోని పప్పడా, కరబా, అమెసింగి, కుతుబ్ ఆదివాసీ గ్రామాల్లో పర్యటించి అక్కడి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అమెసింగి గ్రామంలో ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహికి అనూహ్య ఆదరణ లభించింది. ఈ పర్యటనలో గుమ్మా సమితి అధ్యక్షురాలు సునేమీ మండళ్, ఇతర సర్పంచులు, సమితి సభ్యులు పాల్గొన్నారు.

భార్య గొంతు కోసిన భర్త



రక్తపు మడుగులో ఉన్న మోనిక



కలిమెల ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న మోనిక

మల్కన్‌గిరి: కలిమెల సమితి పోలీసుస్టేషన్ పరిధిలో ఎంవీపీ 23 గ్రామంలో బుధవారం ఓ వ్యక్తి తన భార్య గొంతు కోశాడు. కన్నకూతురి కళ్లెదుటే ఈ దారుణానికి పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. కలిమెల సమితి ఎంవీ 66 గ్రామానికి చెందిన బిభష్ మీర్జాకు 2014లో ఎంవీపీ 23 గ్రామానికి చెందిన మోనికతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల భార్యభర్తల మధ్య గొడవలు ఎక్కువయ్యాయి. దీంతో మోనిక పాపను తీసుకుని కన్నవారింటికి వెళ్లిపోయారు. ఏడాది నుంచి బిభష్ ఆమె ఇంటికి వెళ్లడం, భార్యతో గొడవపడడం పరిపాటిగా మారింది. బుధవారం కూడా ఇలాగే భార్య వద్దకు వెళ్లిన బిభష్ ఆమెతో గొడవ పడి బ్లేడుతో ఆమె గొంతు కోశాడు. కూతురు చూస్తుండగానే ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. రక్తపు మడుగులో ఉన్న తల్లిని చూసిన పాప గట్టిగా కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు వచ్చి బిభష్‌ను నిలదీశారు. దీంతో అతడు పారిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు మోనికను కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఆమె తండ్రి గణేష్ కలిమెల పోలీసులకు ఫిర్యాదు చేశారు. మోనిక పరిస్థితి విషమంగా ఉండడంతో ఆమెను మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కలిమెల పోలీసు ఐఐసి చంద్రకాంత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

8, 9 తేదీల్లో మత్స్య, ప్రాణిసంపద మేళా



మాట్లాడుతున్న కలెక్టర్ బిజయకుమార్ దాస్

పర్లాకిమిడి: గజపతి జిల్లా స్థాయిలో మత్స్య, ప్రాణిసంపద శాఖల మేళా నవంబర్ 8, 9 తేదీల్లో స్థానిక గజపతి స్టేడియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ బిజయకుమార్ దాస్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం మత్స్య, వెటర్నరీ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ మేళాలో మొత్తం 20 స్టాళ్లు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో చేపలు, రొయ్యల పెంపకందార్లకు ఆకర్షించేందుకు ఈ మేళా దోహదపడుతుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. మేళాలో మత్స్య, ప్రాణిసంపద వైజ్ఞానికుల సలహాలు, సూచనలు చేస్తారన్నారు. మేళాకు ప్రతి మండల స్థాయి నుంచి 500 మంది చేపలు, గోవుల పెంపకందారులు విచ్చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. వీటితో పాటు మేళాలో అందరినీ ఆకట్టుకునేందుకు లోక నృత్యాలు, రూపకాలు ప్రదర్శిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ ముందస్తు సమావేశంలో డీ.ఆర్.డీ.ఏ అధికారి డాక్టర్ గుణనిధి నాయక్, జిల్లా ముఖ్య ప్రాణిసంపద అధికారి డాక్టర్ తుషార్ కాంత సాహు, జిల్లా ముఖ్య వ్యవసాయశాఖ అధికారి సురేంద్రనాథ్ స్వయిని, జిల్లా మత్స్యశాఖ అధికారిని లిసా బెహరా, ఉద్యానవనాల సంచాలకులు సుశాంత్ కుమార్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్ : బాలల సంరక్షణ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బాలల రక్షిత గృహాల నిర్వహణపై అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 11 కేంద్రాలు రిజిస్ట్రేషన్ చేసుకోగా, 13 కేంద్రాలు రిజిస్ట్రేషన్ లేకుండా నడుస్తున్నట్లు చెప్పారు. వాటిపై కేసు నమోదు చేసి తక్షణమే మూయించాలని ఆదేశించారు. వసతి గృహాల్లో ఖాళీలు ఉన్నాయని, రిజిస్ట్రేషన్ లేకుండా నడుపుతున్న బాలల సంరక్షణ కేంద్రాల్లో ని చిన్నారులను ప్రభుత్వ హాస్టళ్లలో చేర్పించాలన్నా రు. దత్తతకు అర్హులైన బాలలకు సంబంధించి వైద్య పరీక్షల నివేదికలు వెంటనే మహిళా శిశు సంక్షేమాధికారికి అందజేయాలని సూచించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ బి.శాంతిశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు అనుసరించి కేంద్రాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అనంతరం 'మునగ చె ట్లు మహిళలకు ఆరోగ్యానికి తొలిమెట్టు' అనే పోస్ట ర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఆర్డీఓ కె.సాయిప్రత్యూష, డీఎంహెచ్ఓ డాక్టర్ బి.మీనాక్షి, బాలల సంరక్షణ అధికారి కె.రమణ, ఆర్ఐఓ దుర్గారావు, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విశ్వమోహన్ రెడ్డి, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సంక్షేమ అధికారి అనురాధ, విద్యా శాఖ ఏడీ లియాఖత్ ఆలీఖాన్, గిరిజన సంక్షేమ శాఖ ఏటీడబ్ల్యూఓ శ్రీనివాసరావు, స్వచ్ఛంద సంస్థలు తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలో యాంటీ డ్రగ్ కమిటీ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో యాంటీ డ్రగ్ (మాదక ద్రవ్యా ల నియంత్రణ) కమిటీని ఏర్పాటు చేస్తూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజిని గురువారం ఉత్తర్వులు జారీచేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు తారకేశ్వరరావు, శ్రావణి, శ్రీధర్, హరిత, కేవీఎస్ మూర్తి, తిరుపతిరావు, శ్యామల, కరుణాని. ది, శాంతిలను కమిటీ సభ్యులుగా నియమించారు. విద్యార్థుల విభాగం నుంచి సాయిఅరుణ్‌కుమార్, భార్గవ్‌లకు ప్రాతినిధ్యం కల్పించా రు. మాదక ద్రవ్యాల నియంత్రణకు వీరు కృషిచేస్తారు.

కలెక్టరేట్‌లో వాల్మీకి జయంతి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న కంచు, ఇత్తడి కార్మికులు

శ్రీకాకుళంపాతబస్టాండ్: కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం మహర్షి వాల్మీకి జయంతి నిర్వహించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్ఓ ఎం.అప్పారావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి అనురాధ, డీఎంహెచ్ఓ బి.మీనాక్షి, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ బి.శాంతిశ్రీ, ఆర్ఐఓ దుర్గారావు, గిరిజన సంక్షేమ శాఖ ఏటీడబ్ల్యూఓ శ్రీనివాసరావు, విద్యాశాఖ ఏడీ లియాఖత్ అలీఖాన్ పాల్గొన్నారు.

స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 16 పీజీ కోర్సుల్లో మిగులు సీట్ల ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. ఈ నెల 21 వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. సెట్ ర్యాంకు, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా స్పాట్ ప్రవేశాలు కల్పిస్తున్నారు. పీజీ సెట్ ర్యాంకు తప్పని సరి కావడంతో స్పందన తక్కువగా ఉంది. 562 సీట్లకు 243 ప్రవేశాలు జరగ్గా 319 సీట్లు ఖాళీగా ఉన్నాయి. రెగ్యులర్ కౌన్సెలింగ్‌లో కొ న్ని కోర్సుల్లో కనీస స్థాయిలో ప్రవేశాలు జరగలేదు. తెలుగులో 33, సోషల్ వర్కులో 35, మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజంలో 25, ఎంఎల్ఐఎస్సీలో 33, రూరల్ డెవలప్‌మెంట్‌లో 33, ఎకనామిక్స్‌లో 35, ఎంఈడీలో 30, మ్యాథ్స్‌లో 34, అప్లయిడ్ మ్యాథ్స్‌లో 26 సీట్లు ఖాళీ ఉన్నాయి. ఆసక్తి, విద్యార్హత, ర్యాంకు ఉన్న విద్యార్థులు పీజీ ప్రవేశాలు సద్వినియో గం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

అనైతిక బంధానికి ముగ్గురు బలి

- భార్య, యువకున్ని హత్య చేసి, భర్త ఆత్మహత్య
- బెంగళూరులో ఘోరం
- మృతులు జిల్లావాసులు



సంఘటన జరిగిన కట్టడం



భర్త గొల్లబాబు, హత్యకు గురైన లక్ష్మి, గణేశ్‌కుమార్ (ఫైల్)

బనశంకరి (బెంగళూరు): తప్పుదోవ పట్టిన భార్య, ఆమె ప్రియుని కథ విషాదాంతమైంది. ఆమె భర్త వారిద్దరినీ అక్కడికక్కడే హత్య చేసి తాను కూడా ప్రాణాలు తీసుకున్నాడు. ఈ ఘటన బెంగళూరు కోణణకుంటె పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు.. సోమేశ్వర లేఔట్‌లో నిర్మాణ దశలో ఉన్న కట్టడంలో బుధవారం రాత్రి కూలీ కార్మికురాలు లక్ష్మి (33), ఆమె ప్రియుడు గణేశ్‌కుమార్ (20) ఏకాంతంగా ఉన్నారు. వారిని గమనించిన ఆమె భర్త గొల్లబాబు (41) తీవ్ర కోపోద్రిక్తుడై కట్టె తీసుకుని ఇద్దరిని చావబాదాడు. దెబ్బలకు వారు మృత్యువాత పడ్డారు. కొన్ని గంటల తరువాత అతడు అక్కడే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

నిఘా వేసి ప్రాణాలు తీసి..

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన ముగ్గురూ కొన్నేళ్ల కిందట ఉపాధి కోసం బెంగళూరుకు వచ్చి కట్టడం పనులు చేసుకుంటూ జీవించేవారు. అవివాహితుడైన గణేష్‌కుమార్, గొల్లబాబు దంపతుల వద్దే ఉండేవాడు. వారికి అతడు దూరపు బంధువు అవుతాడని తెలిసింది. ఈ సమయంలో అతని భార్యతో చనువు పెరిగి అనైతిక సంబంధానికి దారితీసినట్లుగా అనుమానాలున్నాయి. కొంతకాలంగా భార్య ప్రవర్తనపై గొల్లబాబుకు అనుమానం పుట్టింది. దీంతో ఆమెపై నిఘా వేశాడు. యువకునితో కలిసి ఉన్న సమయంలో దాడి చేసి హతమార్చాడని దక్షిణ విభాగ డీసీపీ లోకేశ్ భరమప్ప జగలాసర్ తెలిపారు. తర్వాత అతడు బావమరిదికి ఫోన్ చేసి విషయం తెలియజేసి, తాను కూడా చనిపోతున్నానని చెప్పి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందిన వెంటనే కోణణకుంటె పోలీసులు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాలను శవపరీక్షల నిమిత్తం విక్టోరియా ఆసుపత్రికి తరలించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

బూర్జ: మండలంలోని నీలాదేవిపురం (నీలంపేట) గ్రామానికి చెందిన కంచుపల్లి తవిటినాయుడు(44) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తవిటినాయుడు గతంలో బైక్ ప్రమాదంలో గాయపడినప్పటి నుంచి మానసిక స్థితి బాగాలేదు. మద్యానికి అలవాటు పడి తరచూ గొడవలుపడేవాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం గడ్డి మందు తాగడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన స్థానికులు రామచంద్రపురంలోని బంధువుల ఇంటికి వెళ్లిన భార్య కంచుపల్లి రాము, రెండో కుమారుడు సంతోష్‌కి సమాచారం తెలియజేయడంతో వారు వెంటనే వచ్చి 108 అంబులెన్సులో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. భార్య రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.ప్రవల్లిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆధార్ తరహాలో అపార్



- విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు
- వన్ నేషన్ - వన్ స్టూడెంట్ నినాదంతో ఐడీ కార్డుల జారీకి కేంద్రం శ్రీకారం
- జిల్లాలో ఇప్పటికే ప్రారంభమైన ప్రక్రియ
- తొలి విడతగా 9, 10, ఇంటర్ విద్యార్థులకు నమోదు
- డేటా నమోదులో పాఠశాల నిర్వాహకుల బిజీబిజీ

శ్రీకాకుళం న్యూకాలనీ:

ఆధార్ తరహాలో విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు కార్డు అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. జాతీయ విద్యావిధానం అమలులో భాగంగా కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ 'వన్ నేషన్.. వన్ స్టూడెంట్' నినాదంతో విద్యార్థులకు 12 అంకెలతో కూడిన 'అపార్' (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్ట్రీ) నంబర్‌ను కేటాయించనున్నారు. యూడైస్ ప్లస్ వెబ్‌సైట్ వేదికగా జాతీయ స్థాయిలో అపార్ నంబర్ కేటాయించి విద్యార్థికి సంబంధించిన సమస్త సమాచారం అందులో నిక్షిప్తం చేయనున్నారు. జిల్లాలో అన్ని యాజమాన్యాల పరిధిలో మొత్తం పాఠశాలలు, జూనియర్ కళాశాలలు 2840 ఉండగా వీటిల్లో 3,21,200 మంది విద్యార్థులు చదువుతున్నారు.

కేజీ నుంచి పీజీ వరకు..

కేజీ నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులందరికీ ఈ 'అపార్' నంబర్ కేటాయించనున్నారు. మొదటగా ప్రైమరీ స్కూల్ నుంచి హయ్యర్ సెకండరీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ నంబర్ కేటాయించనున్నారు. జిల్లాలో మాత్రం ముందుగా 9, 10, ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థులకు అపార్ కార్డులకు సంబంధించిన డేటాను నమోదు చేస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. ప్రస్తుతం యూడైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో ప్రతి విద్యార్థికి 'పెన్' (పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్) ఉంది. దీని ఆధారంగానే విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడంతో పాటు 'టీసీ' (ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్)లు జారీ చేస్తున్నారు. ఇకపై అపార్ కార్డు ఉంటే శ్రీకాకుళం విద్యార్థి హైదరాబాద్‌లో, ఢిల్లీలో, కాశ్మీర్‌లో ఇలా దేశంలో ఎక్కడికైనా వెళ్లి సులువుగా చదువుకోవచ్చు.

కార్డు పొందేదిలా?

అపార్ కార్డు పొందే విద్యార్థితో పాటు తల్లి లేదా తండ్రి కచ్చితంగా విద్యాసంస్థకు వెళ్లాలి. తొలుత యూడైస్ ప్లస్ నమోదైన వివరాలను వారు సరిచూసుకోవాలి. అనంతరం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. దీనికి ప్రధానోపాధ్యాయుడు లేదా ప్రిన్సిపాల్ ధ్రువీకరణ తప్పనిసరి. విద్యార్థి ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. దానిని నమోదు చేసిన అనంతరం గుర్తింపు నంబరు జారీ అవుతుంది. ఆన్‌లైన్‌లో అపార్ కార్డు ఒకసారి వెలువడితే దాని సవరణకు అవకాశం ఉండదు. కాబట్టి అన్నీ ముందే సరిచూసుకోవాలి. ప్రస్తుతం అన్ని యాజమాన్య పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల డేటా నమోదులో హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్లు బిజీబిజీగా ఉన్నారు. అయితే మెజారిటీ విద్యార్థుల ఆధార్‌కార్డులలో అనేక తప్పులు ఉండటం, టెన్త్ ఉత్తీర్ణులైన విద్యార్థుల మార్క్స్ మెమో, ఆధార్‌కార్డులలో వారి పేర్లు/తల్లిదండ్రుల పేర్లు/జనన తేదీ ఒకే విధంగా లేకపోవడం, ఆధార్‌కు ఫోన్ నంబర్లు అనుసంధానమై లేకపోవడం వంటి కారణాలతో తీవ్రమైన జాప్యం జరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు.



ఇంటర్మీడియెట్ ఫస్టియర్ స్టూడెంట్స్

ఉపయోగాలు అనేకం..

- అపార్ కార్డులో విద్యార్థికి సంబంధించిన పూర్తి వివరాలు అందుబాటులో ఉండటంతో వారికి ఎంతగానో ఉపయోగంగా ఉంటుందని విద్యావేత్తలు అభిప్రాయ పడుతుతున్నారు.
- విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, జెండర్ క్యూఆర్ కోడ్, 12 అంకెలతో కూడిన గుర్తింపు నంబరు అన్నీ కలిపి డిజిటల్ కార్డు రూపంలో భద్రపరుస్తారు.
- విద్యార్థి చదువుకు సంబంధించిన అకడమిక్, విద్యా సంబంధిత వివరాలు ఎప్పటికప్పుడు నమోదవుతాయి.
- విద్యార్థులు సాధిస్తున్న మార్కులు, వారికి వచ్చిన గ్రేడ్, ఉపకార వేతన వివరాలు, క్రీడల్లో సాధించిన విజయాలు, వ్యక్తిగత వివరాలు నమోదు చేస్తుంటారు.
- విద్యార్థికి కేటాయించిన నంబరును ఇంటర్నెట్‌లో అన్వేషించడం లేదా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే పూర్తి సమాచారం చిటికెలో వచ్చేస్తుంది.
- వివిధ విద్యా సంస్థల్లో ప్రవేశాలు, ప్రవేశ పరీక్షల్లో వివరాల నమోదు, ధ్రువీకరణ సులువుగా పూర్తవుతుంది.
- ఉపకార వేతనాలు, ఉద్యోగాల భర్తీ, ఇంటర్వ్యూల సమయంలో అపార్ కీలకం కానుంది. అకాడమీ పరంగా విద్యార్థికి జీవితకాల గుర్తింపుగా పరిగణిస్తారు.
- విద్యార్థి వివరాలన్నీ డీజీ లాకర్ అనుసంధానమై ఉండడంతో సర్టిఫికెట్లను కూడా సులువుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇతర కీలక సమయాల్లో ప్రామాణికంగా తీసుకుంటారు.

రోజూ సమీక్షిస్తున్నాం..



ఆధార్ మాదిరిగా విద్యార్థులకు అపార్ కార్డు జారీకి కేంద్రప్రభుత్వం ఆలోచన చేయడం శుభపరిణామం. విద్యార్థుల డేటా నమోదుకు ప్రతిరోజు ప్రిన్సిపాళ్లతో సమీక్షిస్తున్నాం. విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించే దిశగా వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేయిస్తున్నాం. తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహిస్తున్నాం. – శివ్వాల తవిటినాయుడు, ఇంటర్మీడియెట్ విద్య డీవీఈఓ, శ్రీకాకుళం

తప్పులతో జాప్యం..



వన్ నేషన్ వన్ స్టూడెంట్ నినాదంతో విద్యార్థులకు అపార్ కార్డు జారీ వల్ల వారి భవితవ్యానికి, జీవితకాలంపాటు ఎంతగానో ఉపయోగపడుతుంది. అయితే డేటా నమోదు అనేక సవాళ్లతో కూడుకుని ఉంది. టెన్త్ మార్క్స్ మెమో, ఆధార్ కార్డులలో దోషాలు, రెండింటా తేడాలు ఉండటం వల్ల ఆన్‌లైన్లో తీసుకోవడంలేదు. తల్లిదండ్రులు చొరవ చూపాలి. – కీర్తి తవిటినాయుడు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల కొయ్యాం

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు కావ్య ఎంపిక



రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థిని కావ్య

బొబ్బిలి రూరల్: మండలంలోని నారసింహునిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థిని కారంగి కావ్య రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైంది. ఇటీవల అండర్ 14 విభాగంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కావ్య రాష్ట్రస్థాయిపోటీలకు ఎంపికై నట్లు హెచ్ఎం ఎస్.రామారావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని కావ్యను పీడీ జి. శశికళ, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందిస్తు, రాష్ట్రస్థాయిలో విజయం సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలంటూ ప్రోత్సహించారు.

గంజాయి నిందితుడి అరెస్టు



గంజాయి నిందితుడితో ఎస్.కోట సీఐ రమణమూర్తి తదితరులు

శృంగవరపుకోట: గంజాయి అక్రమ రవాణా చేస్తూ, పోలీసుల కళ్లు గప్పి తప్పించుకున్న నిందితుడిని ఎస్.కోట పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా సీఐ ఎస్.వెంకటరమణమూర్తి తెలిపిన ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. 2021 అక్టోబర్ నెలలో బొడ్డవర చెక్‌పోస్టు వద్ద 90కిలోల గంజాయితో వస్తున్న మారుతి ఆల్టో 800 కారును పోలీసులను చూసి వదిలిపెట్టి అల్లూరి జిల్లా, డుంబ్రిగూడ మండలానికి చెందిన పాంగి కృష్ణ పరారయ్యాడు. ఆ నిందితుడి కోసం ఎస్.కోట పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో అందిన సమాచారంతో గురువారం ఎస్.కోట ఆర్టీసీకాంప్లెక్స్ వద్ద మాటువేసి పాంగి కృష్ణను అరెస్టు చేసి, కోర్టులో మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు.

కోడిశలో పోలీస్ పికెట్

రేగిడి: మండలంలోని కోడిశ గ్రామంలో గురువారం పోలీస్ పికెట్ ఏర్పాటుచేశారు. గ్రామంలోని ఇరువర్గాల మధ్య గొడవలు రేగడంతో వైఎస్సార్‌సీపీ నేత పెంటన్నాయుడుపై దాడులు జరిగాయి. ఈ ఘటనను దృష్టిలో ఉంచుకుని, గ్రామంలో పెద్ద సమస్య తలెత్తకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా ఎస్సై నీలావతి పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

పాడి రైతుల సమస్యలను పరిష్కరించాలి

- ఏపీ పాల రైతుల సంఘం నాయకుడు ఎస్.గోపాలం
- నేడు జామిలో పాల రైతుల జిల్లా సదస్సు



వెలగవలసలో నిరసన తెలుపుతున్న పాల రైతులతో సంఘం నాయకుడు గోపాలం

తెర్లాం: జిల్లాలో గల పాల రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏపీ పాల రైతుల సంఘం నాయకుడు ఎస్.గోపాలం డిమాండ్ చేశారు. ఈ మేరకు పాల రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వెలగవలస పాలకేంద్రం వద్ద రైతులతో కలిసి గురువారం ఆయన నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాల రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం జిల్లాలోని జామి మండల కేంద్రంలో పాల రైతుల జిల్లా సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని పాల రైతులంతా పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

సంప్రదాయ కళలను పరిరక్షించుకోవాలి

- అన్నమయ్య జానపద కళాక్షేత్ర పీఠాధిపతి విజయశంకర స్వామి

నెల్లిమర్ల రూరల్: ప్రస్తుత సమాజంలో సంప్రదాయబద్ధ కళలను, కళాకారులను పరిరక్షించుకోవాలని అవసరం ఎంతైనా ఉందని అన్నమయ్య జానపద కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామి అన్నారు. మండలంలోని రామతీర్థం కల్యాణ మండపం ఆవరణలో భజన మండలి, కోలాట బృందాల సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైందవ ఘతాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తరతరాలుగా వస్తున్న ఆచార సంప్రదాయాల్లో భక్తి భజనలు, కోలాటాలు ప్రముఖ పాత్ర వహిస్తున్నాయని తెలిపారు. ప్రతి శనివారం ఆయా దేవాలయాల్లో భజనలు చేసుకునే అవకాశం కల్పించి కళాకారులను ప్రోత్సహించాలన్నారు. రామతీర్థంలో నిత్యాన్నప్రసాదం 50 మందికి మాత్రమే పరిమితం చేస్తున్నారని.. వచ్చిన భక్తులందరికీ అన్న ప్రసాద వితరణ చేయాలన్నారు. అనంతరం భక్తజన బృందాలతో నూతన కమిటీని ఏర్పాటు చేసి పలు కీలక విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీనివాసరావు, గొర్లి రామునాయుడు, పతివాడ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

భరోసా అందక నిరాశ..!

- నిషేధం తరువాత వేట ప్రారంభమై నాలుగు నెలలు
- మత్స్యకార సాయం ఊసెత్తని సర్కారు
- ప్రభుత్వం నిర్ణయం కోసం లబ్ధిదారుల ఎదురుచూపు
- గడిచిన ఐదేళ్లు సాఫీగా సాగిన చేపలవేట



వేట చేసి చింతపల్లి తీరం చేరుతున్న బోటు

పూసపాటిరేగ: సముద్రంలో చేపల వేటే ఆధారంగా జీవనం సాగిస్తున్న మత్స్యకారులు వేట నిషేధ సాయం కోసం ఎదురు చూస్తున్నారు. సముద్రంలో వేట నిషేధ సమయం ముగిసి నాలుగు నెలలు దాటుతున్నా రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన సర్కారు నుంచి ఎటువంటి ప్రకటన వెలువడలేదు. సముద్రమే సర్వస్వంగా జీవిస్తున్న మత్స్యకారులకు ఈఏడాది మత్స్యకార భరోసా అందని ద్రాక్షలా మిగలడంతో నిరాశతో ఇబ్బంది పడుతున్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మత్స్యకార భరోసాను రెండున్నర రెట్లు పెంచడంతో పాటు లబ్ధిదారుల సంఖ్యను భారీగా పెంచి వేట చేసిన ప్రతి మత్స్యకారుడికి రూ.10 వేలు చొప్పున వారి అకౌంట్‌లో జమచేశారు. అయితే నూతనంగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం మత్స్యకార భరోసాపై కనీసం ప్రకటన చేయకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.4 వేలు ఉన్న మత్స్యకార భరోసాను రూ.10 వేలకు పెంచి వెంటనే వారి అకౌంట్‌లలోకి జమచేసారు. 2020, 2021,2022,2023 సంవత్సరాల్లో క్రమం తప్పకుండా మత్స్యకారుల ఖాతాలకు నగదు జమచేశారు. జిల్లాలో ఈఏడాది మత్స్యకార భరోసాకు 3798 మంది మత్స్యకారులను ఎంపిక చేశారు. సర్వే కూడా పూర్తయిన తరువాత అర్హులను గుర్తించి జాబితాను ప్రభుత్వానికి నివేదించారు.

21వేల మందికి జీవనాధారం

జిల్లాలో పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో 27 కిలో మీటర్ల తీరం ఉంది. ఆ తీరప్రాంతం పరిధిలో సుమారు 21 వేల మంది మత్స్యకారులు జీవిస్తున్నారు. చేపల వేటపై ప్రత్యక్షంగా 6 వేల మంది, పరోక్షంగా 15 వేల మంది ఆధార పడి ఉన్నారు. చేపల పునరుత్పత్తి సీజన్ కావడంతో కేంద్ర ప్రభుత్వం 61 రోజుల పాటు వేట నిషేధం ప్రకటించింది. ఆ సమయంలో ఉపాధి కోల్పోయిన మత్స్యకారులకు ప్రభుత్వం సాయం అందిస్తుంది. కానీ నూతనగా ఏర్పడిన ప్రభుత్వం ఆ సాయం ఊసెత్తకపోవడంతో అసలు సాయం అందిస్తారా? లేదంటే ఈ పథకానికి మంగళం పాడుతారా? అనే విషయమై మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

మత్స్యకార భరోసా మరివ్వరా?

వేటే ప్రధాన ఆదారంగా జీవిస్తున్న మత్స్యకారులకు నాలుగు నెలలు దాటుతున్నా భరోసా అందించకపోవడం దారుణం. నిషేధసమయంలో ఎన్నో ఇబ్బందులు పడ్డాం. గతంలో నిషేధ సమయంలోనే ఠంచన్‌గా నగదు అకౌంట్‌కు జమచేశారు. నూతన ప్రభుత్వంలో మత్స్యకార భరోసాపై పట్టించుకోకపోవడంతో ఆందోళనగా ఉంది.

కొర్లయ్య, మత్స్యకారుడు చింతపల్లి

బడిపిల్లలకు కంటిపరీక్షలు

- పాఠశాలల్లో ఈ నెలాఖరు వరకు నిర్వహణ
- ఇప్పటివరకు 51,115 మందికి పూర్తి



పార్వతీపురంలోని చాకలి బెలగాం రెసిడెన్షియల్ పాఠశాలలో నేత్ర పరీక్షలు చేస్తున్న సిబ్బంది

పార్వతీపురంటౌన్: కంటిచూపు బాగుంటేనే ప్రపంచంలో దేనినైనా సాధించగలం. అయితే ప్రస్తుతం మొబైల్ హవా సాగుతుండడంవల్ల పిల్లల్లోనూ దృష్టి లోపాలు అధికంగా ఉన్నట్లు రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం నిర్వహిస్తున్న పాఠశాల విద్యార్థుల ఐ స్క్రీనింగ్ కార్యక్రమంలో వెల్లడైంది. ఆగస్టు ఒకటవ తేదీ నుంచి ప్రారంభమైన కంటి పరీక్షల కార్యక్రమాలు ఈ నెల 31 వరకు జరగనున్నాయి. రాష్ట్ర అంధత్వ నివారణ సంస్థ ఆదేశాలమేరకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ, జిల్లా విద్యాశాఖ సంయుక్తంగా ఆఫ్తాల్మిక్ అధికారులు, ఆఫ్తాలమిక్ సహాయకులు బృందాలుగా ఏర్పడి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు.

మొబైల్ వినియోగంలో ఎక్కువ శాతం విద్యార్థులే ..

ఆన్‌లైన్ తరగతులు నిర్వహించడం వల్ల పిల్లలకు సెల్‌ఫోన్ వినియోగం అధికం కావడం, ఇంటికి చేరిన తరువాత గేములు, రీల్స్, సినిమాలు చూడడానికి మొబైల్‌నే వినియోగిస్తున్నారు. మొబైల్ వినియోగానికి విద్యార్థులు అలవాటు పడిపోయారు. ఎక్కువ సమయం సెల్ ఫోన్ స్క్రీన్ చూడడం వల్ల అధికంగా దృష్టి దోషాలు వస్తున్నట్లు అంధత్వ నివారణ అధికారులు గుర్తించారు.

విద్యార్థుల్లో అంధత్వాన్ని నివారించడమే ధ్యేయం

విద్యార్థుల్లో అంధత్వాన్ని నివారించడమే ధ్యేయంగా కంటి పరీక్షల కార్యక్రమం నిర్వహిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని ఈ నెల 31లోగా పూర్తి చేస్తాం. విద్యార్థుల్లో లోపాలు ఉంటే గుర్తించి సరైన చికిత్స తక్షణమే అందజేస్తున్నాం. విదార్థుల్లో ఎక్కువ శాతం మొబైల్ వినియోగం వల్ల దృష్టి లోపాలు వస్తున్నాయి. తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలి.

-డాక్టర్ సుకుమార్ బాబు, జిల్లా అంధత్వ నివారణ అధికారి

జిల్లా వ్యాప్తంగా నిర్వహణ

స్కూల్ హెల్త్ కార్యక్రమాన్ని వైద్యులు రూపొందించిన ప్రణాళికల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాల్లో నిర్వహిస్తున్నాం. విద్యార్థులకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరం. మండలాల వారీగా కార్యక్రమం నిర్వహణకు సంబంధిత ఎంఈఓలను ఆదేశించాం. అంధత్వ నివారణ సంస్థ, విద్యాశాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఈ కార్యక్రమం చేపట్టాం.

-జి. పగడాలమ్మ, డీఈఓ, పార్వతీపురం మన్యం

బైక్ అదుపుతప్పి కానిస్టేబుల్ మృతి



మల్లిబాబు(ఫైల్)

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): విధులు నిర్వహించేందుకు వెళ్తుండగా బైక్ అదుపు తప్పడంతో జరిగిన ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్ కె.మల్లిబాబు(48) మృతిచెందారు. కురుపాం మండలంలో గురువారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. ఉద్యోగరీత్యా హిరమండలంలో స్థిరపడిన కె.మల్లిబాబు ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించేందుకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా జరడ నుంచి నీలకంఠాపురం మధ్యలో ఉన్న ఘాట్ రోడ్డు వద్ద బైక్ అదుపుతప్పగా రోడ్డుపై పడిపోయారు. రోడ్డుపై పడిపోయిన మల్లిబాబు అక్కడికక్కడే మృతిచెందారు. ఆయన స్వగ్రామం పాలకొండ సమీపంలోని గొట్టమంగళాపురం. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. , మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుమ్మలక్ష్మీపురం మండలంలోని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నీలకంఠాపురం ఎస్సై నీలకంఠారావు తెలిపారు.

చెరువులో పడి హోం గార్డు..



గార సింహగిరి (ఫైల్)

కొమరాడ: హైదరాబాద్‌లో హోం గార్డుగా పనిచేస్తున్న కొమరాడ మండలంలోని విక్రంపురం పంచాయతీ చంద్రంపేట గ్రామానికి చెందిన గార సింహగిరి(42) చెరువులో పడి గురువారం మృతిచెందారు. పదేళ్ల క్రితం హైదరాబాద్‌లో హోంగార్డు ఉద్యోగం సంపాదించి అక్కడే విధులు నిర్వహిస్తూ కుటుంబంతో ఉంటున్నారు. ఇటీవల ఆయనకు కుమారుడు జన్మించడంతో రెండునెలలు సెలవుపై సొంత ఊరికి వచ్చి సంతోషంగా గడపుతున్న సమయంలో గురువారం గ్రామ పరిసరాల్లో ఉన్న పెద్ద చెరువు వద్దకు బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడిపోయారు. చెరువులో చేపలు పట్టడానికి వేసిన వలలో చిక్కుకున్న ఆయన ఊపిరాడక నీటిలో మృతిచెందారు. ఆయనకు భార్య భవాని, కుమారుడు మోహిత్ ఉండగా ఇటీవల మరో కుమారుడు జన్మించాడు. ఈ ఘటనపై కొమరాడ పోలీసులు కేసునమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి మృతదేహాన్ని తరలించారు.

రైలులో గుండె పోటుతో వ్యక్తి..



రైలులో మృతి చెందిన బండారి సన్యాసిరావు

పార్వతీపురంటౌన్: రైలులో ప్రయాణిస్తున్న వ్యక్తి గుండె పోటుతో మృతి చెందాడు. ఈ సంఘటన లడ్డ-పార్వతీపురం రైల్వే స్టేషన్‌ల మధ్య గురువారం జరిగింది. ఈ ఘటనపై జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు రాయగడ నుంచి విజయనగరం రైలులో వెళ్తున్న బంగారి సన్యాసిరావు (57)కు గుండెపోటు రావడంతో రైలులోనే మృతిచెందాడు. ఈ విషయం గమనించిన తోటి ప్రయాణికులు రైల్వే పోలీసులకు సమాచారం చేరవేశారు. దీనిపై స్పందించిన పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులను రప్పించి మృతదేహాన్ని రాయగడ తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

విజయనగరం క్రైమ్: బైక్ ఢీకొనడంతో గాయపడి చికిత్స పొందుతున్న బొండపల్లి మండలం రయింద్రం గ్రామానికి చెందిన ఎర్రినాయుడు (44) గురువారం మృతి చెందాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 15న స్థానిక సీఎంఆర్ జంక్షన్ వైపు ఎర్రినాయుడు నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి బైక్‌పై వచ్చిన వ్యక్తి బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఇద్దరికీ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ప్రైవేట్ ఆస్పత్రికి స్థానికులు వారిద్దరినీత తరలించగా ఎర్రినాయుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలున్నారు. బైక్‌తో ఢీకొట్టిన వ్యక్తి పరిస్థితి కూడా సీరియస్‌గా ఉందని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్సై నరేష్‌కుమార్ తెలిపారు.

స్కూల్ గేమ్స్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక గురువారం జరిగింది. ఈ మేరకు అండర్ -14,17 వయస్సుల విభాగాల్లో వెయిట్‌లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, బాక్సింగ్ క్రీడాంశాల్లో ఎంపికలు నిర్వహించారు. రాజీవ్ స్టేడియం, కోడిరామ్మూర్తి వ్యాయామ సమాజం ప్రాంగణాల్లో నిర్వహించిన పోటీలను జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డోలా మన్మథకుమార్, కోచ్ బి.ఈశ్వరరావులు హాజరై ప్రారంభించారు. ఎంపిక పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి వివిధ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పోటీ పడగా..వారిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వాయుగుండం ప్రభావంతో వర్షం కురవగా అండర్-17 విభాగంలో బాలికలకు నిర్వహించాల్సిన వాలీబాల్ జట్ల ఎంపిక శుక్రవారానికి వాయిదా వేశారు. అలాగే అండర్-14 విభాగంలో విజ్జీ స్టేడియంలో నిర్వహించాల్సిన క్రికెట్ జట్టు ఎంపిక కూడా వాయిదా వేయగా..మళ్లీ పోటీలు నిర్వహించే తేదీని ప్రకటించనున్నారు.

నేటి నుంచి జరిగే ఎంపికల షెడ్యూల్ ఇదే...

జిల్లా స్థాయిలో నిర్వహించాల్సిన స్కూల్‌గేమ్స్ జట్ల ఎంపిక పోటీల తేదీలను జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కృష్ణంరాజు గురువారం ప్రకటించారు. ఆయా తేదీల్లో అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. అండర్-14,17 వయస్సుల విభాగాలో బాల,బాలికలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

తేదీ	క్రీడాంశం	ఎంపిక జరిగే ప్రదేశం
18-10	రోప్‌స్కిప్పింగ్	పీఎస్ఆర్ స్కూల్, విజయనగరం
18-10	చెస్	డీవీఎం స్కూల్, పార్వతీపురం
19-10	హాకీ	రాజీవ్ స్టేడియం, విజయనగరం
19-10	క్రికెట్ (అండర్-17)	విజ్జి స్టేడియం, విజయనగరం
19-10	అథ్లెటిక్స్ (అండర్-17)	విజ్జి స్టేడియం, విజయనగరం
19-10	బాల్ బ్యాడ్మింటన్	ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎస్.కోట
19-10	త్రోబాల్	రాజీవ్ స్టేడియం, విజయనగరం
19-10	రగ్బీ	జెడ్పీ హైస్కూల్, గరుడబిల్లి
21-10	షటిల్ బ్యాడ్మింటన్	రాజీవ్ స్టేడియం, విజయనగరం
21-10	కబడ్డీ	జెడ్పీ హైస్కూల్, రఘుమండ
22-10	వాలీబాల్(అండర్-14)	జెడ్పీ హైస్కూల్, భోగాపురం
23-10	ఖోఖో	జెడ్పీ హైస్కూల్, మరుపల్లి
23-10	అథ్లెటిక్స్ (అండర్-14)	జెడ్పీ హైస్కూల్, ఎంఆర్ నగరం

డయేరియా రోగులతో కిటకిలాడుతున్న సర్వజన ఆస్పత్రి



సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

విజయనగరం ఫోర్ట్: డయేరియా రోగులతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి కిటకిటలాడుతోంది. మేల్, ఫిమేల్ వార్డుల్లో రోగులు చికిత్స పొందుతున్నారు. విజయనగరం పట్టణంతో పాటు గుర్ల, గజపతినగరం, గరివిడి, గంట్యాడ మండలాలకు చెందిన రోగులకు వ్యాధి తీవ్రత ఎక్కువ ఉండడంతో రోజుల తరబడి ఆస్పత్రిలోనే ఉండి చికిత్స తీసుకుంటున్నారు.

దాడులతో భయపెట్టలేరు

- వైఎస్సార్‌సీపీ రాజాం ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్



ప్రభుత్వ ఆస్పత్రిలో పెంటన్నాయుడిని పరామర్శిస్తున్న డాక్టర్ తలే రాజేష్ తదితరులు

రాజాం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నేతలపై దాడులు చేసి తమను, పార్టీని భయపెట్టలేరని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజాం ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడి కోలుకుంటున్న రేగిడి మండలం కోడిశ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత నెల్లి పెంటన్నాయుడిని రాజాం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఘటనకు సంబంధించిన వివరాలు సేకరించి పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడారు. తమ పార్టీ కార్యకర్తలు, నాయకులపై జరుగుతున్న దాడులను అరికట్టేలా చూడా లని కోరారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పార్టీ అభిమానులతో పాటు ప్రజలకు తామంతా ఎల్లప్పుడూ అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఇటు రాజాంలో, అటు రాష్ట్రంలో ప్రభుత్వం హత్యారాజకీయాలు చేస్తోందని దుయ్యబట్టారు. మళ్లీ తాము అధికారంలోకి వస్తామని, ఈ విషయాన్ని టీడీపీ వారు మరిచిపోవద్దని గుర్తుచేశారు. రానున్న రోజుల్లో టీడీపీ, జనసేన అరాచకపాలన బయటపడుతుందని, ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త, అభిమాని ఓపికతో ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ, రూరల్, రేగిడి మండలాల అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, యాలాల వెంకటేష్, సర్పంచ్‌లు కెల్ల మన్మథరావు, కర్రి జగదీష్, పార్టీ నాయకులు ముదిలి జనార్ధనరావు, ఆల్తి రాంబాబు, కరణం శ్రీనివాసరావు, డాక్టర్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి చిత్రపటానికి ఎస్పీ నివాళులు



వాల్మీకి మహర్షి చిత్ర పటానికి నివాళులర్పించిన ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురంటౌన్:

జిల్లా పోలీసు కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఎస్పీ ఎస్.వి మాధవ్ రెడ్డి వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసంందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటిలాగా చదువుకు ప్రామాణికమైన విద్యాలయాలు అప్పట్లో లేవని, ఆ రోజుల్లో ఆశ్రమాల్లో జ్ఞాన సంపదను నేర్చుకుని, భావితరాల వారికి ఆదర్శప్రాయంగా ఉండేవిధంగా రామాయణ మహాకావ్యాన్ని రచించిన మహా పండితుడు వాల్మీకి అని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డా. ఒ.దిలీప్ కిరణ్, ఏఆర్ డీఎస్పీ ఎస్.వెంకట అప్పారావు, ఆర్ఐలు శ్రీరాములు, శ్రీనివాసరావు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, జిల్లా ఆర్మ్‌డ్, స్పెషల్ బ్రాంచ్, డీసీఆర్‌బీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యులను శిక్షించి.. న్యాయం చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మృతుడి తండ్రి అప్పడు తదితరులు

పార్వతీపురం: తన కుమారుడు రాకేష్ మరణానికి బాధ్యులైన వారిని శిక్షించి, తమకు న్యాయం చేయాలని కోరుతూ గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌కు మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన కర్రి అప్పడు వినతి పత్రం అందజేశాడు.

ఈ విషయంపై అప్పడు మాట్లాడుతూ తమ కుమారుడు గ్రామంలో బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించాడని ఈనెల 14న రూరల్ పోలీస్‌స్టేషన్‌లో అమ్మాయి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు పెట్టి విచారణ నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారని చెప్పాడు. ఈనెల 15న (మంగళవారం) ఉదయం 9.30గంటలకు తమ కుమారుడు రాకేష్ స్టేషన్ నుంచి పారిపోయినట్లు ఎస్సై తమకు తెలిపారన్నారు. 16న ఉదయం బెలగాం రైల్వేస్టేషన్ వద్ద రైల్వే ట్రాక్‌పై తల, మొండెం వేరుగా పడి చనిపోయి, మమ్మల్ని అనాథలు చేశాడని వాపోయాడు. స్టేషన్‌లో కస్టడీలో ఉన్న వ్యక్తి ఎలా తప్పించుకుంటాడని, ఎస్సై బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించి తమ కుమారుడి మరణానికి కారణమయ్యాడని కన్నీటిపర్యంతమయ్యాడు. అలాగే తప్పుడు ఫిర్యాదు చేసి వేధించిన కుమార్తె తల్లిదండ్రులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. తమ కుమారుడి మరణంలో కుట్రకోణం ఉందని, చనిపోయేంత పిరికివాడు కాదని, పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహించి న్యాయం చేయాలని కోరాడు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ ఎస్పీతో చర్చించి తగు న్యాయం చేస్తానని పోస్టుమార్టం నిర్వహించేందుకు సహకరించాలని కోరారు.

పోటీపోటీగా మద్యం దుకాణాలు ప్రారంభం



ఇరువర్గాలవారిని శాంతిపజేస్తున్న ఎల్.కోట ఎస్సై నవీన్ పడాల్

లక్కవరపుకోట:

మండలంలోని మద్యం దుకాణాలు గురువారం పోటాపోటీగా ప్రారంభమయ్యాయి. గోల్డ్ స్టార్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన మద్యం దుకాణం వద్ద గురువారం కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. మండలంలో ఆరు మద్యం షాపులకు లాటరీ నిర్వహించగా అరుగురు వ్యక్తులు దక్కించుకున్నారు. అయితే గోల్డ్‌స్టార్ జంక్షన్ వద్ద గతంలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణం భవనంతో పాటు పక్కనే ఆనుకుని ఉన్న మరో భవనాన్ని సంబంధిత యజమాని వద్ద మేడిబోయిన తులసీదాస్ లీజుకు తీసుకుని షాపును ప్రారంభించారు. అయితే అదే భవనం వద్ద టీడీపీ సానుభూతి పరుడు చొప్ప దేముడు కూడా మద్యం షాపును ప్రారంభించాడు. దీంతో ఇరువర్గాల వారు ఘర్షణకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. తాము లీజుకు తీసుకుని షాపు ప్రారంభించిన వద్ద దౌర్జన్యంగా తెలుగుదేశం సానుభూతిపరులు షాపు పెట్టడం దారుణమని తులసీదాస్ వాపోయారు. ఈ పరిస్థితిలో స్థానిక ఎస్సై నవీన్‌పడాల్ ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాల వారిని శాంతింప చేసి లీజ్ పేపర్ల మేరకు పక్కనే ఉన్న భవనంలో తులసీదాస్ షాపును ప్రారంభించి అమ్మకాలు చేసుకోమని చెప్పారు. అదేషాపు ఎదురుగా వున్న చిన్నపాటి పాన్‌షాపులో చొప్ప దేముడిని ప్రస్తుతానికి అమ్మకాలు చేసుకోమని సూచించారు. ముందస్తు భద్రత నిమిత్తం పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. కాగా ఈ విషయమై ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ నాయుడిని వివరణ కోరగా లాటరీలో షాపులు దక్కించుకున్న యజమానులకు ప్రొవిజనల్ లైసెన్స్‌లే ఇచ్చామని వాటి ప్రకారం వారం రోజుల పాటు గుడి, బడికి దూరంగా మండలంలో ఎక్కడైనా షాపులు ప్రారంభించి అమ్మకాలు చేసుకోవచ్చని చెప్పారు. గోల్డ్‌స్టార్ జంక్షన్ వద్ద గల ప్రభుత్వ షాపులో ఓల్డ్‌సాటోక్‌ను ఇంకా క్లియర్ చేయలేదని, మరో రెండు రోజుల్లో క్లియర్ చేస్తామన్నారు. ఆ తరువాత ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అంతవరకు సంయమనం పాటించి వ్యాపారాలు నిర్వహించుకోవాలని సూచించారు.

పైడితల్లి హుండీల ఆదాయం లెక్కింపు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం , కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు హుండీల ఆదాయం గురువారం ఆలయ కల్యాణ మండపం ఆవరణలో లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు మాట్లాడుతూ చదురుగుడిలో ఉన్న తొమ్మిది శాశ్వత, ఎనిమిది తాత్కాలిక హుండీల నుంచి రూ.43 లక్షల 53వేల 265 నగదు, చిల్లర రూపేణా రూ.లక్షా 48వేల 985 వెరసి రూ.45 లక్షల 2వేల 250 ఆదాయం లభించిందన్నారు. బంగారం 40 గ్రాముల 800 మిల్లీ గ్రాములు, వెండి 955 గ్రాములు లభించాయి. 21 అమెరికా డాలర్లు, రూ.50 వేలు విలువైన ఇండోనేషియా కరెన్సీ నోట్లు లభించాయన్నారు. రైల్వేస్టేషన్ వద్ద ఉన్న వనం గుడిలో ఉన్న ఏడు హుండీలను తెరవగా 45 రోజులకుగానూ నగదు రూపంలో రూ.10 లక్షల 79వేల 513 నగదు, చిల్లర రూపంలో రూ.61వేల 638 ఆదాయం లభించిందని తెలిపారు.